

TG/TEL/25/A3731

# నిజం
దృష్టి తెలుగు న్యూస్




హైదరాబాద్ ఎడిటర్: వరుదు సుజాత సంపుటి:-1 సంచిక:-232 పేజీలు:-4 బుధవారం 05-08-2026

SIMULTANEOUSLY PRINTED AT ADHILABAD I HYDERABAD |NALGONDA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | WARANGAL | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ANANTAPUR | GUNTUR| KADAPA | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM

## పాకిస్థాన్‌లో అతిపెద్ద స్కామ్ మంత్రి నఖ్వీ వ్యాఖ్యలతో రాజకీయ ప్రకంపనలు!

- దేశ చరిత్రలోనే అతిపెద్ద స్కామ్‌ను బయటపెట్టానన్న పాక్ అంతర్గత మంత్రి
- 21 ఏళ్లుగా న్యాయమూర్తులు, నేతలు లంచాలు తీసుకున్నారని ఆరోపణ
- నఖ్వీ వ్యాఖ్యల వెనుక సైన్యాధిపతి అండ ఉందనే ఊహాగానాలు
- మంత్రివర్గ సహచరుడిపైనే పాక్ రక్షణ మంత్రి విమర్శలతో బయటపడ్డ విభేదాలు
- ప్రభుత్వాన్ని బలహీనపరుస్తున్నారంటూ నఖ్వీ రాజీనామాకు విపక్షాల డిమాండ్



పాకిస్థాన్ రాజకీయాల్లో తీవ్ర ప్రకంపనలు రేగాయి. దేశ చరిత్రలోనే అతిపెద్ద కుంభకోణాన్ని తాను బయటపెట్టినట్లు అంతర్గత వ్యవహారాల శాఖ మంత్రి మొహ్సిన్ నఖ్వీ చేసిన వ్యాఖ్యలు అధికార వర్గాల్లోని విభేదాలను బట్టబయలు చేశాయి. న్యాయమూర్తులు, బ్యూరోక్రాట్లు, రాజకీయ నాయకులు, బ్యాంకర్లు ఈ స్కామ్‌లో భాగస్వాములుగా ఉన్నారని, గత 21 ఏళ్లుగా లంచాలు చేతులు మారాయని ఆయన ఆరోపించారు. ఈ వ్యాఖ్యల వెనుక సైన్యం, - మిగతా 2 లో

## ఇరాన్‌ను ఎలా ఒత్తిడికి గురిచేయాలి? కొత్త ఆలోచనలు కోరిన అమెరికా

- నిఘా విశ్లేషకులకు సెంట్‌కామ్ ఈ-మెయిల్
- వినూత్న ఆలోచనలు పంపాలని సూచన
- వైమానిక దాడులపై సందేహాలు
- భూగర్భ కేంద్రాలపై దాడి క్లిష్టమని అంచనా
- చర్చలకు ఇరాన్‌ను తీసుకురావడమే అమెరికా లక్ష్యం



ఇరాన్‌పై మరింత ఒత్తిడి పెంచేందుకు వినూత్న మార్గాలను సూచించాలని అమెరికా సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) తమ నిఘా విశ్లేషకులను కోరినట్లు అంతర్జాతీయ మీడియా వెల్లడించింది. ప్రస్తుత వ్యూహాలతో అధ్యక్షుడు - మిగతా 2 లో

## నియోజకవర్గానికైనా స్థానిక ఎమ్మెల్యేనే బాస్



- తుంగతుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు
- 7 పేజీలతో నివేదికను పీసీసీ చీఫ్ కు అందించిన జగ్గారెడ్డి
- అందరి నుంచి అభిప్రాయాలను సేకరించి నివేదికను తయారు చేశామన్న జగ్గారెడ్డి

సూర్యాపేట జిల్లా తుంగతుర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న అంతర్గత - మిగతా 2 లో

## హైదరాబాద్ కు భారీ వర్ష సూచన ఎల్లో అలర్ట్ జారీ



- వాయుగుండం కారణంగా తెలంగాణలో భారీ వర్షాలు
- హైదరాబాద్ లో నేడు ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం
- వాహనదారులు, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్న అధికారులు

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా తెలంగాణలో వర్షాలు విరామం - మిగతా 2 లో

# కొత్త పింఛన్లకు గ్రీన్ సిగ్నల్
# 2.25 లక్షల మంది అకౌంట్‌లోకి డబ్బులు

- తెలంగాణ ప్రభుత్వం కొత్త 'చేయూత'
- సామాజిక భద్రత పింఛన్ల పంపిణీని ఆగస్టు 15, 2026 నుంచి ప్రారంభించనుంది
- తొలి దశలో 2,25,599 మంది అర్హులకు పింఛన్లు మంజూరు చేశారు.



తెలంగాణలో కొత్త సామాజిక భద్రత పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులైన లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం శు భవార్త ప్రకటించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా కొత్త 'చేయూత' పింఛన్ల

# నిరుద్యోగ సంక్షోభం
# మోదీ సర్కార్‌కు పెనుసవాల్

- పరీక్ష పత్రాల లీక్‌పై యువత ఆగ్రహం.. కేంద్ర మంత్రి రాజీనామా
- దేశంలో తీవ్రమవుతున్న నిరుద్యోగ సంక్షోభంపై నిపుణుల ఆందోళన
- విద్యా వ్యవస్థ వైఫల్యం, పడిపోతున్న ఉపాధి అవకాశాలు
- మోదీ సర్కార్‌కు దీర్ఘకాలిక సవాల్‌గా మారిన యువత అసంతృప్తి



పరీక్ష పత్రాల లీకేజీ ఉదంతాలపై దేశవ్యాప్తంగా యువత నిరసనలతో అట్టుడగడంతో, గత నెలలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ పరిణామంతో మోదీ

## ఆలస్యం చేస్తే చాలా కష్టం



- జనన మరణాల నమోదుకు కొత్త రూల్స్.. పార్లమెంట్‌లో బిల్లుకు ఆమోదం!
- ఆలస్యంగా చేసే రిజిస్ట్రేషన్లకు కఠినమైన నిబంధనలు
- రెండేళ్లు దాటితే జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఉత్తర్వులు అవసరం
- దేశంలో 99 శాతానికి పైగా పెరిగిన జనన, మరణాల నమోదు
- గుర్తింపు మోసాలను అరికట్టడమే లక్ష్యమని తెలిపిన కేంద్రం

దేశంలో జనన మరణాల నమోదు ప్రక్రియను మరింత పటిష్ఠం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం - మిగతా 2 లో

## అయోధ్య నిధుల కేసులో సాధువుల ప్రమేయం లేదు



- అయోధ్య నిధుల దుర్వినియోగం కేసులో సాధువుల ప్రమేయం లేదని వెల్లడి
- సిట్ ప్రాథమిక నివేదికలో ఈ విషయం స్పష్టమైందన్న ముఖ్యమంత్రి
- యూపీ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకే విపక్షాల కుట్ర అని ఆరోపణ

అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి ఆలయ విరాళాల దుర్వినియోగం ఆరోపణల- మిగతా 2 లో

## 'అమరజీవి జలధార' గోదావరి జిల్లాల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం



- జల్ జీవన్ మిషన్ కింద అమలవుతున్న 'అమరజీవి జలధార' ప్రాజెక్టు
- తీరప్రాంతాల్లోని 33 లక్షల మందికి సురక్షిత మంచినీటిని అందించడమే లక్ష్యం
- నిర్దేశిత వ్యవధిలోనే నిర్మాణాలను పూర్తి చేయాలన్న పవన్

జల్ జీవన్ మిషన్ కింద చేపడుతున్న 'అమరజీవి జలధార' ప్రాజెక్టు - మిగతా 2 లో

## నైతిక విలువలతోనే సంపూర్ణ విద్యా వికాసం

మంత్రి లోకేశ్‌తో చాగంటి కోటేశ్వరరావు



- విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌తో చాగంటి కోటేశ్వరరావు భేటీ
- నైతిక విలువలతో కూడిన విద్య ఆవశ్యకతపై కీలక చర్చ
- విద్యార్థులను బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- ప్రభుత్వ పాఠశాలల్లో నైతిక విలువల బోధనపై సమీక్ష

ప్రముఖ ప్రవచనకర్త, నైతిక విలువల సలహాదారు బ్రహ్మశ్రీ - మిగతా 2 లో

# వాళ్లది విధ్వంసం
# మాది పునర్నిర్మాణం

- రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేసిన చంద్రబాబు
- గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రం రూ.9.74 లక్షల కోట్ల అప్పుల ఊబిలో కూరుకుపోయిందన్న సీఎం
- రెండేళ్లలో రూ.1.49 లక్షల కోట్ల సంక్షేమం, రూ.30,607 ఉద్యోగాలు అందించామని వెల్లడి
- అమరావతి, పోలవరం పూర్తి చేసి తీరతామని స్పష్టం చేసిన చంద్రబాబు
- విశాఖ, అమరావతి, తిరుపతి కేంద్రాలుగా ట్రిపుల్ ఇంజన్ గ్రోత్ వ్యూహంతో సమగ్రాభివృద్ధి
- సంక్షేమం ఆగదు, అభివృద్ధి ఆగదన్న చంద్రబాబు



ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితిపై ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం నాడు శ్వేతపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనను "విధ్వంసం"గా అభివర్ణిస్తూ, తమ ఎన్డీయే ప్రభుత్వం చేపడుతున్నది

## 'అమరజీవి జలధార' గోదావరి జిల్లాల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

మొదటిపేజీ తరువాయి – ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతుందని ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. మంగళగిరిలోని తన క్యాంప్ కార్యాలయంలో ఈ ప్రాజెక్టు పనుల పురోగతిపై ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. తీరప్రాంతాల్లోని దాదాపు 33 లక్షల మంది ప్రజలకు సురక్షితమైన మంచినీటిని అందించడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టును రూపొందించినట్లు పవన్ వివరించారు. నిర్మాణ పనుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ నాణ్యత విషయంలో రాజీ పడకూడదని అధికారులకు స్పష్టం చేశారు. నిర్దేశిత వ్యవధిలోనే కీలక నిర్మాణాలను పూర్తి చేసి, ప్రాజెక్టును సాధ్యమైనంత త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. తీరప్రాంత ప్రజల తాగునీటి భద్రతను నిర్ధారించడంలో జల్ జీవన్ మిషన్ కీలక పాత్ర పోషిస్తోందని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం కొనియాడారు.

## నైతిక విలువలతోనే సంపూర్ణ విద్యా వికాసం

మొదటిపేజీ తరువాయి – చాగంటి కోటేశ్వరరావు మంగళవారం రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఉండవల్లిలోని మంత్రి నివాసంలో జరిగిన ఈ సమావేశంలో.. విద్యా వ్యవస్థలో నైతిక విలువల ప్రాముఖ్యత, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే అంశాలపై వీరిద్దరి మధ్య కీలక చర్చ జరిగింది. ఈ సందర్భంగా చాగంటి కోటేశ్వరరావు మాట్లాడుతూ.. విద్యార్థులను సమాజంలో బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దాలంటే నైతిక విలువలతో కూడిన విద్య అందించడం ఎంతో కీలకమని అభిప్రాయపడ్డారు. చిన్నతనం నుంచే పిల్లల్లో మానవతా విలువలు, క్రమశిక్షణ, నైతికత వంటి గుణాలను పెంపొందించాల్సిన అవసరాన్ని ఆయన మంత్రికి వివరించారు. కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా, సంపూర్ణ వికాసం దిశగా విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో చాగంటి కోటేశ్వరరావు దిశానిర్దేశంలో రూపొందించిన నైతిక విలువల పాఠ్యాంశాలను 'నో బ్యాగ్ డే' రోజున బోధిస్తున్న సంగతి తెలిసిందే. నైతిక విలువలతో కూడిన విద్య ద్వారానే సమగ్ర విద్యా వికాసం సాధ్యమని నమ్మిన ప్రభుత్వం చేస్తున్న కృషిలో భాగస్వామి కావడం పట్ల చాగంటి సంతోషం వ్యక్తం చేశారు. భేటీ ముగిసిన అనంతరం మంత్రి లోకేశ్ స్వయంగా చాగంటి గారిని కారు వద్దకు వచ్చి వినయపూర్వకంగా సాగనంపారు.

## నియోజకవర్గానికైనా స్థానిక ఎమ్మెల్యేనే బాస్

మొదటిపేజీ తరువాయి – విభేదాలు, వర్గపోరు అంశంపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, పార్టీ పరిశీలకుడు జగ్గారెడ్డి తన సమగ్ర నివేదికను సిద్ధం చేశారు. మొత్తం 7 పేజీలతో కూడిన ఈ రిపోర్టును సీల్డ్ కవర్‌లో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌కు ఆయన అందజేశారు. తుంగతుర్తి నియోజకవర్గంలో ఇటీవల చోటుచేసుకున్న ఘర్షణలు, వర్గ విభేదాలపై గత పది రోజుల పాటు క్షేత్రస్థాయిలో పర్యటించి ఇరువర్గాలు, స్థానిక నాయకులు, కార్యకర్తల నుంచి అభిప్రాయాలను సేకరించినట్లు జగ్గారెడ్డి తెలిపారు. ఆ వివరాలన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ఈ నివేదికను రూపొందించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన... ఏ నియోజకవర్గానికైనా స్థానిక ఎమ్మెల్యేనే 'ఫస్ట్ బాస్' అని, ఆ తర్వాతి స్థానంలోనే ఎంపీ, మంత్రులు ఉంటారని స్పష్టం చేశారు. అలాగే మూడో ప్రాధాన్యత డీసీసీ అధ్యక్షుడికి ఉంటుందని వ్యాఖ్యానించారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి సంబంధించిన వివాదాలు, ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలను కూడా ఈ నివేదికలో పొందుపరిచామని చెప్పారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా కాంగ్రెస్ పార్టీకి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిలు ప్రధాన స్తంభాలని ఈ సందర్భంగా జగ్గారెడ్డి పేర్కొన్నారు.

## హైదరాబాద్ కు భారీ వర్ష సూచన.. ఎల్లో అలర్ట్ జారీ

మొదటిపేజీ తరువాయి – లేకుండా కురుస్తున్నాయి. వీటి ప్రభావంతో నేడు హైదరాబాద్ నగరం వ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు నగర ప్రజలను అప్రమత్తం చేస్తూ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఆకాశం రోజంతా మేఘావృతమై ఉంటుందని, పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. నిన్న హైదరాబాద్‌తో పాటు ఉత్తర తెలంగాణ జిల్లాల్లో కుండపోత వర్షం ముంచెత్తింది. గడిచిన 24 గంటల్లో కామారెడ్డి జిల్లాలో అత్యధికంగా 18.2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కాగా... వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లోనూ భారీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. రోడ్లపైకి వస్తున్న వాహనదారులు, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## ఆలస్యం చేస్తే చాలా కష్టం

మొదటిపేజీ తరువాయి – ప్రతిపాదించిన కీలక బిల్లుకు పార్లమెంట్ ఆమోద ముద్ర వేసింది. జనన మరణాల నమోదు (సవరణ) బిల్లు-2026కు మంగళవారం రాజ్యసభ ఆమోదం తెలిపింది. లోక్‌సభలో ఇదివరకే ఆమోదం పొందిన ఈ బిల్లు, త్వరలోనే చట్టరూపం దాల్చనుంది. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. తాజా సవరణల ప్రకారం, జనన లేదా మరణ ధ్రువీకరణ పత్రాలను ఆలస్యంగా నమోదు చేయాలంటే కఠిన నిబంధనలు వర్తిస్తాయి. ఘటన (పుట్టిన లేదా మరణించిన) జరిగిన ఏడాది తర్వాత (రెండేళ్ల లోపు) నమోదు చేయాల్సి వస్తే జిల్లా మేజిస్ట్రేట్ లేదా సబ్-డివిజనల్ మేజిస్ట్రేట్ నుంచి ముందస్తు అనుమతి పొందడం తప్పనిసరి. ఒకవేళ రెండేళ్లు దాటిన పక్షంలో, ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఉత్తర్వులు ఉంటేనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. ఈ సందర్భంగా మంత్రి నిత్యానంద రాయ్ మాట్లాడుతూ, జనన మరణాలను నిర్ణీత సమయంలోగా నమోదు చేయడాన్ని ప్రోత్సహించడంతో పాటు, తప్పుడు సమాచారం, అవకతవకలను అరికట్టడమే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 3.5 లక్షల రిజిస్ట్రేషన్ యూనిట్లు అందుబాటులో ఉన్నాయని, 2014లో 86.6 శాతంగా ఉన్న జననాల నమోదు 2024 నాటికి 99 శాతానికి పైగా చేరిందని ఆయన వివరించారు. అదేవిధంగా మరణాల నమోదు 72.5 శాతం నుంచి 99.4 శాతానికి పెరిగిందని మంత్రి వెల్లడించారు. బిల్లుపై జరిగిన చర్చలో భాగంగా బీజేపీ ఎంపీ దర్శన సింగ్ మాట్లాడుతూ, ఈ కొత్త సవరణలు వ్యవస్థను మరింత సరళంగా, పారదర్శకంగా మారుస్తాయని కొనియాడారు. అయితే, రెండేళ్ల తర్వాత జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌ను ఆశ్రయించాలనే నిబంధనపై బీజేడీ ఎంపీ డాక్టర్ సంతృప్త్ మిశ్రా కొంత ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ఇప్పటికే పనిభారంతో ఉన్న న్యాయస్థానాలపై మరింత ఒత్తిడి పెంచుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. వైసీపీ, కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, బీఆర్ఎస్, అన్నాడీఎంకే సహా పలు పార్టీల సభ్యులు ఈ బిల్లుకు మద్దతు తెలిపారు.

## అయోధ్య నిధుల కేసులో సాధువుల ప్రమేయం లేదు



మొదటిపేజీ తరువాయి – కేసులో సాధువులు, సంతుల ప్రమేయం ఏమీ లేదని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ స్పష్టం చేశారు. ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) సమర్పించిన ప్రాథమిక నివేదికలో ఈ విషయం వెల్లడైందని ఆయన మంగళవారం పేర్కొన్నారు. ఈ అంశంపై సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్‌లు కేవలం రాజకీయ లబ్ధి కోసమే రాద్ధాంతం చేస్తున్నాయని యోగి ఆరోపించారు. ఉత్తరప్రదేశ్ ప్రతిష్ఠను మసకబార్చేందుకు, ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే విపక్షాలు ప్రయత్నిస్తున్నాయని ఆయన విమర్శించారు. అసెంబ్లీలో నిర్ణీత ఎజెండాపై చర్చ జరపకుండా, సభా కార్యక్రమాలకు అంతరాయం కలిగించడం అప్రజాస్వామికమని, రాజ్యాంగ విరుద్ధమని ఆయన వ్యాఖ్యానించారు. ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో ఈ అంశాన్ని ప్రస్తావిస్తామని విపక్షాలు ప్రకటించడంతో ఈ వివాదం మరోసారి ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ కేసు విచారణ నిమిత్తం ఐజీ కిరణ్ నేతృత్వంలో నూతన సిట్‌ను ఏర్పాటు చేసినట్లు జూలై 27న రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు విన్నవించింది. ఈ కేసుకు సంబంధించి దర్యాప్తు బృందం ఇప్పటివరకు ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

# వాళ్లది విధ్వంసం, మాది పునర్నిర్మాణం

మొదటిపేజీ తరువాయి – "పునర్నిర్మాణం" అని స్పష్టం చేశారు. 2019 నుంచి 2024 మధ్య కాలంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పూర్తిగా నాశనం చేశారని, సంస్థలను నిర్వీర్యం చేసి, రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని తీవ్ర స్థాయిలో విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చిన గత రెండేళ్లలో చేపట్టిన దిద్దుబాటు చర్యలు, భవిష్యత్ ప్రణాళికలను ఆయన సమగ్రంగా వివరించారు.

### గత ఐదేళ్లది విధ్వంసం.. మాది పునర్నిర్మాణం

2024 ఎన్నికల్లో ప్రజలు చారిత్రక తీర్పు ఇచ్చారని, ఇది ఒక నిశ్శబ్ద విప్లవం అని చంద్రబాబు అభివర్ణించారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో భయంకరమైన పరిస్థితులు నెలకొన్నాయని, స్వేచ్ఛగా మాట్లాడే పరిస్థితి కూడా లేదని అన్నారు. ప్రజావేదిక కూల్చివేతతో విధ్వంస పాలన ప్రారంభమైందని, అమరావతిని ఆపేసి, పోలవరాన్ని నిర్వీర్యం చేసి, పారిశ్రామికవేత్తలను తరిమికొట్టి "బ్రాండ్ ఆంధ్రప్రదేశ్"ను పూర్తిగా దెబ్బతీశారని ఆరోపించారు. తాము అధికారంలోకి వచ్చాక ప్రధాని నరేంద్ర మోదీ, జనసేన అధినేత పవన్ కల్యాణ్ సహకారంతో రాష్ట్రాన్ని మళ్లీ గాడిలో పెట్టేందుకు అనునిత్యం శ్రమిస్తున్నామని తెలిపారు.

### విభజన నష్టం కంటే విధ్వంసమే ఎక్కువ

2014లో రాష్ట్ర విభజన బాధాకరమైనప్పటికీ, 2019-24 మధ్య జరిగిన విధ్వంసం అంతకంటే భయంకరమైన మానసిక వేదనను మిగిల్చిందని చంద్రబాబు అన్నారు. విభజన సమయంలో 58% జనాభాకు 46% వనరులే వచ్చాయని, అయినా ఐదేళ్లలో కష్టపడి ఆర్థిక వ్యవస్థను ఒక దారికి తెచ్చామని గుర్తుచేశారు. కానీ, గత ప్రభుత్వం అన్ని వ్యవస్థలనూ నాశనం చేసిందని, అధికారుల నైతిక స్థైర్యాన్ని దెబ్బతీసి, రాష్ట్రాన్ని అగమ్యగోచర స్థితిలోకి నెట్టిందని విమర్శించారు.

### ఆర్థిక గమనం.. రాష్ట్రాల మధ్య వ్యత్యాసం

గత ప్రభుత్వ ఆర్థిక విధానాల వల్ల ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య తలసరి ఆదాయంలో వ్యత్యాసం విపరీతంగా పెరిగిపోయిందని చంద్రబాబు అంకెలతో సహా వివరించారు. "2014-15లో తెలంగాణ, ఏపీ మధ్య తలసరి ఆదాయ వ్యత్యాసం రూ.30,201గా ఉండేది. మా ఐదేళ్ల పాలనలో దాన్ని రూ.25,000కు తగ్గించగలిగాం. కానీ, 2019-24 మధ్య కాలంలో ఈ వ్యత్యాసం ఏకంగా రూ.1,06,854కు పెరిగిపోయింది. ఒకవేళ 2014-19 మధ్య సాధించిన 13.5% వృద్ధిరేటు కొనసాగి ఉంటే, రాష్ట్రానికి అదనంగా రూ.76,195 కోట్ల ఆదాయం వచ్చేది. అప్పుడు అప్పులు చేయాల్సిన అవసరం ఉండేది కాదు" అని ఆయన విశ్లేషించారు.

అప్పుల ఊబిలోంచి బయటపడేస్తున్నాం

గత ప్రభుత్వం రాష్ట్రాన్ని రూ.9.74 లక్షల కోట్ల అప్పుల ఊబిలో ముంచిందని, నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం ఏపీ 'జీరో డెట్ సస్టైనబిలిటీ' స్థితికి చేరిందని, అంటే అప్పు పుట్టని దుస్థితికి వచ్చిందని చంద్రబాబు తెలిపారు. తాము అధికారంలోకి వచ్చాక పెండింగ్‌లో ఉన్న రూ.48,616 కోట్ల బిల్లుల్లో ఇప్పటికే రూ.29,000 కోట్లకు పైగా చెల్లించామని, ఉద్యోగుల బకాయిలు రూ.30,849 కోట్లు క్లియర్ చేశామని వివరించారు. అధిక వడ్డీలకు తీసుకున్న రూ.50,000 కోట్ల విలువైన 370 రుణాలను పునఃసమీక్షించి (రీ-నెగోషియేట్), ఏటా రూ.1,100 కోట్ల చొప్పున మొత్తం రూ.8,269 కోట్ల ఆదా చేశామన్నారు. నిధులు పక్కదారి పట్టడంతో నిలిచిపోయిన 86 కేంద్ర ప్రాయోజిత పథకాలను పునరుద్ధరించి, రూ.29,890 కోట్లు డ్రా చేయగలిగామని తెలిపారు.

### సంక్షేమానికి పెద్దపీట.. అభివృద్ధికి బాటలు

ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, సంక్షేమ హామీలను నెరవేర్చడంలో వెనకడుగు వేయలేదని చంద్రబాబు స్పష్టం చేశారు. గత రెండేళ్లలో సంక్షేమ పథకాల కోసం రూ.1,49,401 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. ఎన్టీఆర్ భరోసా కింద రూ.68,296 కోట్లు, తల్లికి వందనం కింద రూ.20,210 కోట్లు, అన్నదాత సుఖీభవకు రూ.8,724 కోట్లు అందించామన్నారు. దీంతో పాటు, రెండేళ్లలో 30,607 ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని, ఇందులో 15,941 ఉపాధ్యాయ పోస్టులతో మెగా డీఎస్సీ చేపట్టామని గుర్తుచేశారు.

### 4, కుటుంబ సాధికారతతో పేదరిక నిర్మూలన

సంక్షేమం అంటే కేవలం డబ్బులు ఇవ్వడమే కాదని, ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే తమ లక్ష్యమని చంద్రబాబు అన్నారు. ఇందుకోసం 'కుటుంబ సాధికారత మిషన్' ప్రారంభించామని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యానికి (పీపీపీ) ప్రజల భాగస్వామ్యాన్ని (పీ4) జోడించి 'పీ4' అనే నూతన విధానాన్ని ప్రవేశపెట్టామన్నారు. 'మార్గదర్శి బంగారు కుటుంబం' (వీడీఖ 10-20) పథకం కింద సమాజంలో ఆర్థికంగా ఉన్నత స్థాయిలో ఉన్న 10% మంది, వెనుకబడిన 20% కుటుంబాలను దత్తత తీసుకుని వారిని ఆర్థికంగా పైకి తీసుకురావాలని పిలుపునిచ్చారు.

### అమరావతి, పోలవరం పూర్తి చేసి తీరతాం

అమరావతి ప్రజల రాజధాని అని, అది ఒక సెల్ఫ్ ఫైనాన్సింగ్ ప్రాజెక్టు అని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఫేజ్-1 పనుల కోసం ఇప్పటికే రూ.41,000 కోట్లకు పైగా నిధులు సమీకరించామని, త్వరలోనే పనులు వేగవంతం చేస్తామని తెలిపారు. అదేవిధంగా, రాష్ట్ర జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును మార్చి నాటికి పూర్తిచేసి ప్రధానమంత్రి చేతుల మీదుగా ప్రారంభిస్తామని ప్రకటించారు. దీనికోసం రూ.12,157 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు.

### మూడు ప్రాంతాల సమగ్రాభివృద్ధికి ట్రిపుల్ ఇంజన్ వ్యూహం

రాష్ట్ర సమగ్రాభివృద్ధికి 'డబుల్ ఇంజన్ సర్కార్ - ట్రిపుల్ ఇంజన్ గ్రోత్' వ్యూహాన్ని అనుసరిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. రాష్ట్రాన్ని మూడు ఆర్థిక రీజియన్లుగా విభజించి అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించారు.

1. విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్ (ఎజు=): పోర్ట్ ఆధారిత తయారీ, గ్రీన్ హైడ్రోజన్, ఏఐ, డేటా సెంటర్ల హబ్‌గా అభివృద్ధి చేస్తారు. సుమారు రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులతో 10 లక్షల ఉద్యోగాలు లక్ష్యం.
2. అమరావతి ఎకనామిక్ రీజియన్ (ూజు=): పరిపాలన, నాలెడ్జ్ క్యాపిటల్‌గా, ఏఐ, క్వాంటం, డేటా సెంటర్ల కేంద్రంగా తీర్చిదిద్దుతారు. రూ.6-8 లక్షల కోట్ల పెట్టుబడులు లక్ష్యం.
3. తిరుపతి ఎకనామిక్ రీజియన్ (ుజు=): స్పేస్, డిఫెన్స్, డ్రోన్, ఎలక్ట్రానిక్స్, రెన్యువబుల్ ఎనర్జీ హబ్‌గా అభివృద్ధి చేస్తారు. రూ.10-12 లక్షల కోట్ల పెట్టుబడులతో 10 లక్షల ఉద్యోగాలు లక్ష్యం.

### ముందున్న సవాళ్లు.. భవిష్యత్ ప్రణాళిక

రాష్ట్ర సొంత ఆదాయంలో 98% ఉద్యోగుల జీతభత్యాలకే సరిపోతోందని, ఇది కర్ణాటక (28%), తెలంగాణ (44%)తో పోలిస్తే చాలా అధికమని చంద్రబాబు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదాయాన్ని పెంచుకుంటూ, ఖర్చులను అదుపు చేస్తూ ఆర్థిక క్రమశిక్షణ పాటించాల్సిన అవసరం ఉందన్నారు. పిపిపి, వైబిలిటీ గ్యాప్ ఫండింగ్ (ఏ+ఫీ) ద్వారా మూలధన వ్యయాన్ని పెంచుతామని తెలిపారు. అంతిమంగా రాష్ట్రాన్ని ఆరోగ్యకరమైన, సంపన్నమైన, సంతోషకరమైన సమాజంగా తీర్చిదిద్ది, 'స్వర్ణాంధ్ర విజన్ 2047' సాధించడమే తమ ధ్యేయమని స్పష్టం చేశారు. రాష్ట్ర పునర్నిర్మాణంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

## కొత్త పింఛన్లకు గ్రీన్ సిగ్నల్ 2.25 లక్షల మంది అకౌంట్‌లోకి డబ్బులు

మొదటిపేజీ తరువాయి – పంపిణీని ఆగస్టు 15 నుంచి ప్రారంభించాలని నిర్ణయించారు. తొలి దశలో సుమారు 2.25 లక్షలకుపైగా అర్హులకు కొత్త పింఛన్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేస్తోంది. పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారికంగా ప్రారంభించనున్నారు. అదే సమయంలో జిల్లాల్లో ఇన్‌చార్జి మంత్రులు లబ్ధిదారులకు పింఛన్ మంజూరు పత్రాలను అందజేసేలా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. కార్యక్రమం సజావుగా జరిగేలా సంబంధిత శాఖలు ఇప్పటికే మార్గదర్శకాలను సిద్ధం చేశాయి. ప్రభుత్వ అంచనాల ప్రకారం రాష్ట్రంలో 2,25,599 మంది కొత్త అర్హులైన లబ్ధిదారులకు ఈ విడతలో పింఛన్లు మంజూరు కానున్నాయి. సామాజిక భద్రతను మరింత విస్తరించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో ఒంటరి మహిళలు, వితంతువులు, వృద్ధులు, దివ్యాంగులు, చేనేత కార్మికులు, గీత కార్మికులు, బీడీ కార్మికులు, బీడీ టేకేదార్లు, హెచ్ఐవీ-ఏఆర్టీ బాధితులు, ఫైలేరియా రోగులు, డయాలసిస్ పేషెంట్లు సామాజిక భద్రత పింఛన్లు పొందుతున్నారు. వీరితో పాటు తలసీమియా మరియు సికిల్ సెల్ అనీమియా బాధితులను కూడా పింఛన్ పథకంలో చేర్చాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో కొత్తగా మరిన్ని వర్గాలకు ఈ పథకం ప్రయోజనం అందనున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త లబ్ధిదారుల చేర్పు ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటివరకు మొత్తం 1,23,625 మంది కొత్త లబ్ధిదారులకు పింఛన్లు మంజూరు చేసినట్లు ప్రభుత్వ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇందులో 82,625 మంది వృద్ధాప్య పింఛన్, 19,044 మంది వితంతు పింఛన్, 13,830 మంది హెచ్ఐవీ-ఏఆర్టీ బాధితులు, 6,996 మంది డయాలసిస్ రోగులు, 982 మంది దివ్యాంగులు ఉన్నారు. తాజా ఆదేశాల నేపథ్యంలో అర్హుల గుర్తింపు ప్రక్రియను అధికారులు వేగవంతం చేశారు. ఇటీవల నిర్వహించిన కుల గణన (సీపెక్ సర్వే) ద్వారా సేకరించిన సమాచారం, అలాగే స్వయం సహాయక మహిళా సంఘాలు (ూఎ+౦) అందించిన వివరాలను ఆధారంగా తీసుకుని లబ్ధిదారుల ఎంపిక చేపడుతున్నారు. ఈ ప్రక్రియను సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ (ూజుూ=) అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

ఆగస్టు 15 నుండి ప్రారంభమయ్యే చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఎంతవరకు విజయవంతమవుతుంది?

చాలా విజయవంతమవుతుంది
మధ్యస్థంగా విజయవంతమవుతుంది
తక్కువ విజయవంతమవుతుంది
విజయవంతం కాదు

# నిరుద్యోగ సంక్షోభం మోదీ సర్కార్‌కు పెనుసవాల్

మొదటిపేజీ తరువాయి – ప్రభుత్వం తాత్కాలికంగా సంక్షోభం నుంచి గట్టెక్కినప్పటికీ, యువతలో పేరుకుపోతున్న అసంతృప్తి భవిష్యత్తులో ప్రభుత్వానికి దీర్ఘకాలిక సవాల్‌గా మారనుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ మేరకు అంతర్జాతీయ వార్తా సంస్థ బీబీసీ ఓ కథనం వెలువరించింది. లీకేజీ కేసుల విచారణ నిమిత్తం ఫాస్ట్-ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేస్తామని, పరీక్షా వ్యవస్థలో సంస్కరణల కోసం టెక్ నిపుణుడు నందన్ నీలేకని నేతృత్వంలో కమిటీని నియమిస్తామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించారు. అయినప్పటికీ, తగిన ఉపాధి అవకాశాలు కల్పనలోనూ, ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యంతో కూడిన విద్యను అందించడంలోనూ విఫలమవుతున్న ప్రస్తుత వ్యవస్థపై యువతలో అసహనం పెరుగుతోంది. వారి ఆందోళనలను నివృత్తి చేయడానికి ప్రభుత్వం మరింత నిర్మాణాత్మకమైన ప్రయత్నాలు చేయాల్సి ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. ప్రముఖ ఆర్థికవేత్త సంతోష్ మెహ్రోత్రా బీబీసీతో మాట్లాడుతూ, "గత దశాబ్ద కాలంలో కార్మిక మార్కెట్ స్థితుగతులు క్షీణించాయి. వ్యవసాయేతర ఉద్యోగాల సృష్టి మందగించడంతో పాటు, వాస్తవ వేతనాలు కూడా స్తంభించిపోయాయి" అని వెల్లడించారు. బలహీనమైన ఆర్థిక వ్యవస్థ వల్ల ఉద్యోగాలకు గిరాకీ పెరగడం లేదని, మరోవైపు మన విద్యా వ్యవస్థ సైతం నాణ్యమైన మానవ వనరులను అందించడంలోవెనుకబడి ఉందని ఆయన విశ్లేషించారు. అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీ 'స్టేట్ ఆఫ్ వర్కింగ్ ఇండియా 2026' నివేదిక ప్రకారం, ప్రస్తుతం పట్టభద్రుల్లో నిరుద్యోగిత రేటు గత 25 ఏళ్ల నాటి తరహాలోనే 35-40 శాతం వద్ద కొనసాగుతోంది. అయితే, పెరిగిన జనాభా దృష్ట్యా సమస్య తీవ్రత మరింత అధికంగా కనిపిస్తోంది. 2023 నాటికి 67 శాతం మంది గ్రాడ్యుయేట్లకు సరైన ఉపాధి లేదని ఈ నివేదిక స్పష్టం చేసింది. అదేవిధంగా, జీడీపీలో తయారీ రంగం వాటా 17 శాతం నుంచి 14 శాతానికి తగ్గడం, కృత్రిమ మేధ (ఏఐ) రాకతో ఐటీ రంగంలో నియామకాలు మందగించడం ఈ సంక్షోభాన్ని మరింత జఠిలం చేస్తున్నాయి. కేవలం ఏసీ కార్యాలయాల్లోని ఉద్యోగాలనే ఆశించకుండా, నైపుణ్యం ఆధారిత వృత్తులైన ప్లంబింగ్, ఎలక్ట్రీషియన్ వంటి పనులను కూడా చేపట్టేందుకు యువత సిద్ధపడాలని నిపుణులు సూచిస్తున్నారు. ప్రస్తుత యువత తమ తల్లిదండ్రుల కంటే మెరుగైన జీవన ప్రమాణాలను పొందలేని పరిస్థితులు నెలకొన్నాయని, ఇది దేశానికి పెను ముప్పుగా పరిణమించకుండా మోదీ ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాలని మార్కెట్ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## పాకిస్థాన్‌లో అతిపెద్ద స్కామ్.. మంత్రి నఖ్వీ వ్యాఖ్యలతో రాజకీయ ప్రకంపనలు!



మొదటిపేజీ తరువాయి – పౌర ప్రభుత్వానికి మధ్య పెరుగుతున్న ఘర్షణ వాతావరణమే కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు. విలేకరులతో మాట్లాడుతూ.. ఈ కుంభకోణంలో బాధ్యులైన ప్రతి ఒక్కరిపై కఠిన చర్యలు తీసుకుంటామని నఖ్వీ హెచ్చరించారు. అయితే, ఆయన ఎవరి పేర్లనూ బయటపెట్టలేదు. కొద్ది రోజుల క్రితం కూడా ఆయన పాకిస్థాన్ పాలనా వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిపోయిందని వ్యాఖ్యానించారు. ఇది పౌర ప్రభుత్వంపై చేసిన విమర్శలుగానే అందరూ భావించారు. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ఛైర్మన్‌గా కూడా ఉన్న నఖ్వీకి, ఆ దేశ సైన్యాధిపతి ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్‌కు అత్యంత సన్నిహితుడిగా పేరుంది. ఆయన చేసిన ఆరోపణలు పౌర సంస్థలను లక్ష్యంగా చేసుకున్నవే తప్ప, సైన్యం ప్రస్తావన ఎక్కడా లేకపోవడం గమనార్హం. నఖ్వీ వ్యాఖ్యలపై ప్రభుత్వంలోనే వ్యతిరేకత వ్యక్తమైంది. రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్, నఖ్వీపై బహిరంగంగా విమర్శలు గుప్పించారు. ఆయన కేబినెట్, పార్లమెంట్ సమావేశాలకు సరిగా హాజరు కావడం లేదని, ముందు తన సొంత మంత్రిత్వ శాఖ, పీసీబీలో సంస్కరణలు చేపట్టాలని చురకలు అంటించారు. మరోవైపు నఖ్వీ వ్యాఖ్యలు ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరిచేలా ఉన్నాయంటూ 'పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ' (పీపీపీ) ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. ప్రాంతీయ దౌత్య వ్యవహారాల్లో, ముఖ్యంగా ఇరాన్‌తో మధ్యవర్తిత్వ చర్చల్లో నఖ్వీ ప్రత్యేక ప్రతినిధిగా వ్యవహరించడం సైనిక నాయకత్వంతో ఆయనకున్న సాన్నిహిత్యాన్ని సూచిస్తోంది. ప్రస్తుత పరిణామాలు అధికార వర్గాల్లోని తీవ్ర విభేదాలను సూచిస్తున్నాయా? లేక అంతర్గత ఒత్తిడి వ్యూహాల్లో భాగమా? అనే దానిపై పాక్ రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది.

## ఇరాన్‌ను ఎలా ఒత్తిడికి గురిచేయాలి? కొత్త ఆలోచనలు కోరిన అమెరికా



మొదటిపేజీ తరువాయి – డొనాల్డ్ ట్రంప్ లక్ష్యాలు నెరవేరకపోవచ్చనే ఆందోళనతో ఈ చర్య చేపట్టినట్లు తెలిపింది. గత వారం సెంట్‌కామ్‌కు చెందిన ఓ సీనియర్ సైనిక అధికారి పెద్ద సంఖ్యలో నిఘా విశ్లేషకులకు ఈ-మెయిల్ పంపినట్లు సీఎన్ఎన్ వెల్లడించింది. ఇరాన్‌పై ఒత్తిడి పెంచే, కఠిన చర్యలకు దారి తీసే కొత్త ఆలోచనలు పంపాలని అందులో కోరినట్లు పేర్కొంది. సైనిక, దౌత్యపరమైన చర్యల పరిమితుల కారణంగా ఈ ప్రయత్నం జరిగినట్లు సమాచారం. ఈ అంశంపై సెంట్‌కామ్ ప్రతినిధి కెప్టెన్ టిమోతి హాకిన్స్ స్పందించారు. వినూత్న ఆలోచనలను ప్రోత్సహించడం తమ కమాండ్‌లో ఎప్పటి నుంచో కొనసాగుతున్న సంప్రదాయమని చెప్పారు. అడ్మిరల్ బ్రాడ్ కూపర్ తరచూ అన్ని స్థాయిల సిబ్బంది నుంచి సూచనలు కోరుతుంటారని వివరించారు. ఇటీవల ఇరాన్ సైనిక సామర్థ్యాలను బలహీనపరిచే లక్ష్యంతో అమెరికా వైమానిక దాడులు నిర్వహించింది. అయినా వాటి వల్ల ఇరాన్ చర్చలకు వస్తుందనే నమ్మకం అమెరికా నిఘా సంస్థలకు లేదని సీఎన్ఎన్ పేర్కొంది. భూగర్భంలో ఉన్న అణు కేంద్రాలను కేవలం వైమానిక దాడులతో ధ్వంసం చేయడం కష్టమని సైనిక వ్యూహకర్తలు భావిస్తున్నట్లు తెలిపింది. పరిమిత స్థాయిలో దాడులు చేపట్టే అవకాశాన్ని కూడా అమెరికా అధికారులు పరిశీలించినట్లు సమాచారం. మరోవైపు ఇరాన్ క్షిపణి సామర్థ్యాలపై ఒకటి నుంచి రెండు వారాలపాటు విస్తృత దాడులకు సంబంధించిన ప్రణాళికలు కూడా సిద్ధంగా ఉన్నట్లు వెల్లడైంది. అయితే సామాన్య పౌరుల మరణాలు పెరిగే ప్రమాదం, వైమానిక రక్షణ వ్యవస్థల నిల్వలు తగ్గిపోతుండటంపై ఆందోళనలతో తుది నిర్ణయం వాయిదా పడినట్లు తెలిపింది.

నిజం దృష్టి తెలుగు న్యూస్
బుధవారం 05-08-2026

# మహిళ, బాలిక అదృశ్యం



**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, ఆగస్టు 4:** ఫిర్యాదుదారుడు గణపతి సత్య ప్రవీణ్, తండ్రి పేరు కోటేశ్వర రావు, వయస్సు: 39 సంవత్సరాలు, వృత్తి: ప్రైవేట్ ఉద్యోగి, నివాసం: పద్మ ఎలిజియం అపార్ట్‌మెంట్, హై-టెన్షన్ రోడ్, హైదర్‌నగర్, కేపీహెచ్‌బీ.ం

**వాస్తవాలు:** కేసు యొక్క సంక్షిప్త వాస్తవాలు ఏమనగా, ఫిర్యాదుదారుడు తన కుటుంబంతో కలిసి పద్మ ఎలిజియం అపార్ట్‌మెంట్, హై-టెన్షన్ రోడ్, హైదర్‌నగర్, కేపీహెచ్‌బీలో నివసిస్తున్నాడు. 12 సంవత్సరాల క్రితం అతనికి తన భార్య గణపతి లక్ష్మీ ప్రసన్నతో వివాహం జరిగింది. ఆమె వయస్సు: 35 సంవత్సరాలు, వృత్తి: గృహిణి. వారికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. నిన్న అనగా 03.08.2026న రాత్రి సుమారు 20:00 గంటలకు, వారిద్దరి మధ్య ఒక చిన్న వాగ్వాదం జరిగింది. ఆ తర్వాత 04.08.2026న ఉదయం సుమారు 08:00 గంటలకు అతను తన పనికి బయలుదేరాడు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో అతను ఇంటికి తిరిగి వచ్చినప్పుడు, తన భార్య కనిపించకుండా పోయిందని గమనించాడు; ఆమె సమీపంలో ఎక్కడా కనబడలేదు. అతను ఆమె మొబైల్ నంబర్ (9502151872)కు ఫోన్ చేయగా, ఆ నంబర్ బ్లాక్ చేయబడినట్లు తెలిసింది. తాను తిరిగి రానని, వారి పెద్ద కుమార్తెను జాగ్రత్తగా చూసుకోమని ఆమె ఒక సందేశం పంపింది. అతను వారి బంధువులను సంప్రదించగా, ఆమె తమ వద్దకు రాలేదని గానీ, ఫోన్‌లో గానీ మాట్లాడలేదని వారు ధృవీకరించారు. ఆమెతో పాటు, వారి చిన్న కుమార్తె యోషిత (వయస్సు: 03 సంవత్సరాలు, వృత్తి: నర్సరీ విద్యార్థిని) కూడా కనిపించకుండా పోయింది. అందువల్ల, అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆమె కోరింది.

**నేతృత్వ విచారణ:** ఎస్ వెంకటేష్, ఏఎస్ఐ, ఫోన్: 9000194204

## కీర్తిశేషులు పెద్దిని రాములమ్మ అంత్యక్రియల్లో పాల్గొన్న భేరి రామచందర్ యాదవ్



**నిజం న్యూస్ వికారాబాద్, ఆగస్టు 4:** వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గం కంటెస్టెడ్ ఎమ్మెల్యే బేరి రామచందర్ యాదవ్ మేనత్త పెద్దిని రాములమ్మ పాల్గొన్నారు. పూడూరు మండలం సిరిగాయపల్లి గ్రామంలో పెద్దిని రాములమ్మ ఈ నెల 03వ తేదీ సోమవారం నాడు స్వర్గస్తులైనారు. ఈమె బీసీ కుల సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు భేరి రామచందర్ యాదవ్ మేనత్త. ఆమె బేరి వంశంలో ఆఖరి మేనత్త. ఆమె మరణం చాలా బాధాకరమని బేరి రామచందర్ యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె బంధాలకు బంధుత్వాలకు విలువలను ఇచ్చే గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఆమె మృతి పెద్దిని మరియు భేరి వారి కుటుంబాలకు తీరని లోటు అని రామచందర్ యాదవ్ గుర్తు చేస్తూ తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భవంతున్ని వేడుకున్నారు. పెద్దిని రాములమ్మ కుమారులైన పెద్దిని నర్సింలు, పెద్దిని సీతారాములు ని ఓదార్చి అంత్యక్రియలలో పాల్గొన్నారు. ఇందులో భాగంగా భేరి ఆంజనేయులు యాదవ్ భేరి కృష్ణ భేరి రఘు రాములు అంత్యక్రియలో పాల్గొన్నారు. పెద్దిని రాములమ్మ భేరి వారి కుటుంబానికి ఆడపడుచు కావడంతో భేరి వారి కుటుంబ సభ్యులు మరియు బీసీ లిబరేషన్ ఫోర్స్ రాష్ట్ర అధ్యక్షులు రామ్ గోపాల్ సిరిగాయపల్లి సర్పంచ్ అంబటి రాజు మాజీ సర్పంచ్ దాసు భేరి ఆంజనేయులు భేరి మహేందర్ భేరి అనంతయ్య భేరి కృష్ణ భేరి వెంకటయ్య భేరి శ్రీను భేరి మాసయ్య యాదవ్, గొర్ల లక్ష్మయ్య యాదవ్, గంగాల తిరుమలయ్య, సత్యనారాయణ యాదవ్, రవి యాదవ్, దాస్ యాదవ్ మరియు బంధువులు పెద్ద సంఖ్యలో హాజరై కుటుంబ సభ్యుల మధ్య మంగళవారం రోజున అంత్యక్రియలు ముగించారు.

## మత్తు వ్యసన నిర్మూలనకు అందరూ కృషి చేయాలి: మిరియాల ప్రీతమ్



**నిజం న్యూస్ శేరిలింగంపల్లి ప్రతినిధి, ఆగస్టు 4:** మదినగూడ డివిజన్ హుడా కాలనీ పరిధిలో 'నషా ముక్త్ భారత్ అభియాన్', మిషన్ స్పందన్ ఆధ్వర్యంలో బ్రహ్మకుమారీస్ సంస్థ నిర్వహించిన 10 కోట్ల మంది మత్తు వ్యసన రహిత ప్రతిజ్ఞ మహా ప్రచారం కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో శేర్లింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ జగదీశ్వర్ గౌడ్, రఘునందన్ రెడ్డి, ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు మిరియాల ప్రీతమ్ పాల్గొని మత్తు వ్యసన రహిత సమాజ నిర్మాణానికి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా మిరియాల ప్రీతమ్ మాట్లాడుతూ, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలని సూచించారు. సమాజంలో మత్తు వ్యసనాలను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. బ్రహ్మకుమారీస్ సంస్థ చేపడుతున్న అవగాహన కార్యక్రమాలు సమాజానికి ఎంతో ఉపయోగకరమని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో అధికారులు, సామాజిక కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు సౌందర్య రాజన్ శ్రీహరి, చంద్ర శేఖర్ , మస్తాన్ రెడ్డి మోసిన్ నారాయణరెడ్డి శేఖర్ త్రిలోచన్ కార్యకర్తలు పాల్గొని మత్తు వ్యసన నిర్మూలనకు తమ మద్దతు ప్రకటించారు.

## బీపీఎం కాలనీలో పర్యటించిన తుంగతుర్తి రవి



**నిజం న్యూస్ ప్రతినిధి, మేడిపల్లి,ఆగస్టు 4 :** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ 9వ డివిజన్ మేడిపల్లి పరిధిలోని బీపీఎం కాలనీలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు తుంగతుర్తి రవి మంగళవారం మున్సిపల్ ఏఈ సాయి కిరణ్ ,కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు నరేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి, ముదిగొండ రమేష్, వెంకటేష్ గౌడ్, కాలనీ వాసులతో కలిసి పర్యటించారు. కాలనీలోని రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, వీధి దీపాలు తదితర మౌలిక సదుపాయాలను పరిశీలించిన ఆయన, స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తెలిపిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను కోరారు. అలాగే డివిజన్ లోని అన్ని కాలనీల వాసులకు మెరుగైన మౌలిక వసతులు అందించడమే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తామని, ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని తుంగతుర్తి రవి తెలిపారు.

# వరంగల్, హనుమకొండ బస్టాండ్లలో TGSRTC ఎండీ నాగిరెడ్డి ఆకస్మిక తనిఖీలు



**నిజం న్యూస్ వరంగల్ 4:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ వై. నాగిరెడ్డి వరంగల్, హనుమకొండ ప్రధాన బస్టాండ్లు, హనుమకొండ డిపోలో మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రయాణికులకు అందుతున్న సేవలు, డిపో నిర్వహణ, మౌలిక సదుపాయాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వరంగల్ నగర ప్రజా రవాణాను మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వ 'పీఎం ఈ-బస్ సేవ' పథకం కింద మరో 100 కొత్త ఎలక్ట్రిక్ బస్సులను త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం వరంగల్ రీజియన్‌లో 112 ఎలక్ట్రిక్ బస్సులు విజయవంతంగా నడుస్తున్నాయని తెలిపారు. బస్టాండ్లలో పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం, మహిళా ప్రయాణికుల భద్రత, వెయిటింగ్ హాళ్ల నిర్వహణ, బస్సుల సమయపాలనపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం రీజినల్ మేనేజర్, డిపో మేనేజర్లు, డ్రైవర్లు, కండక్టర్లతో సమావేశమైన నాగిరెడ్డి బస్సు రూట్లు, ఆక్యుపెన్సీ నిష్పత్తి, ఉద్యోగుల సమస్యలపై సమీక్ష నిర్వహించారు. ఆర్టీసీపై ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ సురక్షితమైన, నాణ్యమైన ప్రయాణాన్ని అందించడమే సంస్థ ప్రధాన ధ్యేయమని ఎండీ నాగిరెడ్డి స్పష్టం చేశారు. ప్రయాణికులకు సేవలందించడంలో ఎలాంటి అలసత్వాన్ని సహించబోమని, ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతిరోజూ 9 వేలకుపైగా బస్సుల ద్వారా సుమారు 60 లక్షల మంది ప్రయాణికులకు ఆర్టీసీ సేవలు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. రానున్న రోజుల్లో వరంగల్ ఉమ్మడి జిల్లాలో ప్రజా రవాణా సేవలను మరింత ఆధునీకరించి, ప్రయాణికులకు సురక్షితమైన, వేగవంతమైన, నాణ్యమైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం. రాజశేఖర్, చీఫ్ సివిల్ ఇంజినీర్ కవిత, వరంగల్ రీజినల్ మేనేజర్ భవానీ ప్రసాద్‌తో పాటు ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణలో జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువును ఆగస్టు 25, 2026 వరకు పొడిగించిన హైకోర్టు

**నిజం న్యూస్ హైదరాబాద్, ఆగస్టు 4:** తెలంగాణ హైకోర్టు 03 ఆగస్టు 2026న జరిగిన విచారణలో ప్రస్తుతం అమల్లో ఉన్న జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువును 2026 ఆగస్టు 25 వరకు పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (టీయూడబ్ల్యూజేఎఫ్) దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను కొనసాగించింది. పిటిషనర్ తరఫున న్యాయవాది బర్కత్ అలీ ఖాన్ వాదనలు వినిపించారు. విచారణ సందర్భంగా ప్రతివాదులు ఇప్పటికే పిటిషనర్లలో ఎక్కువమందికి అక్రిడిటేషన్ కార్డులు జారీ చేసినట్లు కోర్టుకు తెలిపారు. అయితే ఈ వాదనపై పిటిషనర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడంతో, ఇప్పటివరకు జారీ చేసిన అన్ని అక్రిడిటేషన్ కార్డుల పూర్తి వివరాలు, జాబితాను కోర్టుకు సమర్పించాలని న్యాయస్థానం ప్రతివాదులను ఆదేశించింది. తదుపరి విచారణ తేదీ నుంచి కేసులో తుది విచారణ, తుది వాదనలు ప్రారంభమవుతాయని కోర్టు స్పష్టం చేసింది. అందుకు ముందు ఇరు పక్షాలు తమ వద్ద ఉన్న అన్ని సంబంధిత పత్రాలు, ఆధారాలను కోర్టు రికార్డులో సమర్పించాలని ఆదేశించింది. ప్రతివాదులు కోర్టు ఆదేశాలను అమలు చేయడంలో జరిగిన లోపాలను ప్రస్తావిస్తూ, సంఘటనల వారీగా తేదీలతో కూడిన నివేదికను పిటిషనర్ కోర్టులో సమర్పించగా, దానిని న్యాయస్థానం రికార్డులో భాగంగా చేర్చింది. హైకోర్టు ఇచ్చిన ఈ ఉత్తర్వులతో కేసు తుది నిర్ణయం వచ్చే వరకు రాష్ట్రంలోని వర్కింగ్ జర్నలిస్టులు తమ వృత్తిపరమైన హక్కులు, ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రవేశం, ప్రభుత్వ గుర్తింపుతో లభించే ఇతర సౌకర్యాలను నిరంతరంగా వినియోగించుకునే అవకాశం కల్పించబడింది. ఈ కేసు తదుపరి విచారణతో పాటు తుది వాదనల ప్రారంభం కోసం 2026 ఆగస్టు 25కు వాయిదా వేయబడింది.

# ఫీజు బకాయి... బీజేపీ లడాయి కార్యక్రమంలో భాగంగా భరత్ నగర్ కూరగాయల మార్కెట్‌లో వినూత్న నిరసన పాల్గొన్న రాష్ట్ర బిజెపి సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు



**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, ఆగస్టు 4:** కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని భరత్ నగర్ కూరగాయల మార్కెట్‌లో "ఫీజు బకాయి -- బీజేపీ లడాయి" కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి వ్యతిరేకంగా భారతీయ యువ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన వినూత్న నిరసన కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మార్కెట్‌లో కూరగాయలు విక్రయించడం, కూరగాయల బస్తాలు మోయడం, రోడ్లు ఊడవడం వంటి పనులు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. అనంతరం వ్యాపారులు, కార్మికులు, ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేసి ప్రభుత్వ మొండి వైఖరిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేద మరియు మధ్యతరగతి విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా వేలాది మంది విద్యార్థుల చదువులు మధ్యలోనే ఆగిపోయే పరిస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. "రాష్ట్ర ప్రభుత్వానికి నిధులు లేకుంటే మేమే మార్కెట్‌లో కూరగాయలు అమ్ముతాం... బస్తాలు మోస్తాం... రోడ్లు ఊడుస్తాం... వాటితో వచ్చిన డబ్బును ప్రభుత్వానికి అందిస్తాం. కానీ పేద విద్యార్థుల భవిష్యత్తుతో మాత్రం చెలగాటం ఆడవద్దు" అంటూ ప్రభుత్వంపై ఘాటు విమర్శలు చేశారు.ప్రజల సంక్షేమం, విద్యార్థుల భవిష్యత్తు పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించిన ఆయన, వెంటనే ఫీజు బకాయిలను విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని, లేకపోతే బీజేపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యువమోర్చా నాయకులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మార్కెట్ వ్యాపారులు, కార్మికులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విద్యార్థులకు మద్దతు ప్రకటించారు.

# కేపీహెచ్‌బీ కాలనీ 6వ ఫేజ్ సీనియర్ సిటిజన్స్ పార్క్ అభివృద్ధికి కృషి చేస్తాం -- వడ్డేపల్లి రాజేశ్వరరావు



**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, ఆగస్టు 4:** కూకట్‌పల్లి కేపీహెచ్‌బీ కాలనీ 6వ ఫేజ్‌లోని సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ ప్రతినిధుల , వసంత్ నగర్ డివిజన్ కోఆర్డినేటర్ గురుప్రసాద్ ఆహ్వానం మేరకు రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు మంగళవారం సీనియర్ సిటిజన్స్ పార్క్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పార్కులో ఉన్న సౌకర్యాలను పరిశీలించి, వృద్ధులకు ప్రశాంతమైన వాతావరణంలో విహరించేలా అన్ని మౌలిక సదుపాయాలతో పార్కును అభివృద్ధి చేయడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ సభ్యులు పార్కులో నెలకొన్న వివిధ సమస్యలను రాజేశ్వరరావు దృష్టికి తీసుకువచ్చారు. పార్కు అభివృద్ధి, వాకింగ్ ట్రాక్, కూర్చునే బెంచీలు, పచ్చదనం, తాగునీరు, లైటింగ్ తదితర మౌలిక సదుపాయాల మెరుగుదల వారి దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలను ఓర్పుగా విన్న వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ, సీనియర్ సిటిజన్స్ సంక్షేమానికి అవసరమైన అభివృద్ధి పనులను పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ దృష్టికి తీసుకెళ్లి, ఎంపీ నిధుల ద్వారా సాధ్యమైనంత త్వరగా పనులు చేపట్టేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అభివృద్ధి కార్యక్రమాలకు తన పూర్తి సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని రాజేశ్వరరావు తెలిపారు.అలాగే సీనియర్ సిటిజన్స్ ప్రతిరోజూ యోగా, ఆరోగ్య సాధనతో పాటు ఇతర సామాజిక కార్యక్రమాలను నిర్వహించుకునేందుకు వారి విజ్ఞప్తి మేరకు యోగా కార్పెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిల్ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ రాజేశ్వరరావు కి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు దేశబత్తుల సుధ,ప్రీతం రెడ్డి,ఎం. కోటేశ్వరరావు, సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ సభ్యులు సుబ్బరాజు, శివశంకర్ రెడ్డి, ప్రొఫెసర్ అప్పారావు, రామకృష్ణ, భానుమతి, గాయత్రి, రమణారావు, జనార్ధన్, కొండరెడ్డి, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి శాశ్వత చర్యలు చేపట్టాలి కమిషనర్ కు ప్రజల విజ్ఞప్తి



**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, ఆగస్టు 4:** సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన బాలానగర్ డివిజన్ లోని రాజుకాలనీ కమ్యూనిటీ హాల్ లో మూసాపేట సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం సమస్యలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కూకట్పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి పుష్పగుచ్చంతో కమిషనర్ కు అందజేసి స్వాగతం పలికారు. సమస్యలపై కమిషనర్ సమీక్షా సమావేశం విర్వహిస్తున్నారు అని తెలుసుకున్న వివిధ పార్టీల నేతలు కార్యక్రమానికి హాజరయ్యారు. మొదట కమిషనర్ సృజన మాట్లాడుతూ స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఒక్కొక్కరుగా చెప్పాలని కోరారు. కార్యక్రమానికి హాజరైన కూకట్పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యంగా భారీ వర్షాలు పడిన ప్రతీసారీ కల్యాణినగర్ ముంపునకు గురై కాలనీ మొత్తం నీటిలో మునిగిపోతుందని, దీన్ని నివారించేందుకు శాశ్వత పరిష్కారం వెతకాలని కోరారు. చెరబండరాజునగర్ కాలనీలో శ్మశాన వాటిక అభివృద్ధికి నోచుకోకుండా ఉందని అభివృధి కోసం కృషి చేయాలని కోరారు. వివిధ పార్టీలకు చెందిన నేతలు, స్థానిక ప్రజలు స్థానిక సమస్యలపై ఏకరువు పెట్టారు. ఈ కార్యక్రమంలో కూకట్పల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లిగారి లక్మయ్య, బీ బ్లాక్ రాజ సెల్ ప్రెసిడెంట్ బందిగా బాల నరసింహ,మేడ్చల్ ఫిషర్ మెన్ కమిటీ వైస్ చైర్మన్,బాలానగర్ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు ఆకుల నరేందర్ ముదిరాజ్,బాలానగర్ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రసన్న కుమార్,కళ్యాణినగర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ యూసఫ్, బాలానగర్ డివిజన్ బిజెపి అధ్యక్షుడు డా.కిరణ్, బాలానగర్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు కవిత కాతురాయ, వివిధ కాలనీల అధ్యక్ష కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు. నాలుగు నెలల తరువాత మళ్ళీ వస్తా ఈ సందర్భంగా కమిషనర్ సృజన మాట్లాడుతూ స్థానిక ప్రజలు చెప్పిన ప్రతీ సమస్యను రాసుకుంటున్నామని, సాధ్యమైనంతవరకు సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. తన పరిధిలో ఉన్న ప్రతీ డివిజన్ ను రోజుకు ఒకసారి తిరిగి అక్కడి సమస్యలను తెలుసుకోవడానికి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చెయ్యడం జరిగిందని చెప్పారు. ప్రజలు చెప్పిన సమస్యలను కేవలం రాసుకోవడమే కాకుండా సమస్య పరిష్కారం ఎంతవరకు వచ్చిందని తెలియజేసేందుకు నాలుగు, ఐదు నెలలకు ఒకసారి మళ్ళీ వచ్చి తప్పకుండా చెబుతానని స్పష్టం చేశారు.



# ఉజ్జయిని మహంకాళి ఆషాడ జాతర బోనాల ఉత్సవాలను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదములు తెలిపిన ఆలయ కమిటీ

**నిజం న్యూస్ సికింద్రాబాద్ ప్రతినిధి, ఆగస్టు 4:** ఉజ్జయిని మహంకాళి దేవస్థానము ఆషాడ జాతర బోనాల పండుగ మొదట ఘటోత్సవం, బోనాలు,రంగం, ముఖ్యంగా పాల్గొన్నవారు సనత్ నగర్ ఇంచార్జ్ డాక్టర్ కోట నీలిమ, రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు సతీమణి గీతా, పొన్నం ప్రభాకర్ తెలంగాణ స్టేట్ ఇన్చార్జి, మినిస్టర్, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాజ్య సభ్యులు పవన్ కేర, డిసిసి ప్రెసిడెంట్ దీపక్ జాన్ హనుమంతరావు, ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామఅయ్యర్, హైదరాబాద్ కలెక్టర్,ఎండోమెంట్ కమిషనర్ హనుమంతరావు,ఎండోమెంట్ రాష్ట్ర మంత్రివర్యులు కొండ సురేఖ,దానం నాగేంద్ర, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, రాష్ట్ర గవర్నర్ దంపతులు,కంటోన్మెంట్ గణేష్, ఎమ్మెల్సీ దయానంద గుప్తా గారు, సి.పి సజ్జనర్ దంపతులు, వెన్నెల గారు, మాజీ మేయర్, మాజీ కార్పొరేటర్లు, వాసవి క్లబ్ గవర్నమెంట్ సముద్రాల కృష్ణమూర్తి మరి మాజీ వాసవి క్లబ్ గవర్నర్లు, బిజెపి బండి సంజయ్,ఈటెల రాజేందర్, సికింద్రాబాద్ పట్టణ ఆర్యవైశ్య మహాసభ, జ్యువెలర్స్ అండ్ కిరాణా అండ్ వర్తక సంఘం ఉమన్ రైట్స్ చైర్మన్ కటకం శ్రీనివాస్ శ్రీకాంత్ గుప్తా ఎందరో పాల్గొన్నవారు ఉన్నారు వారికి అందరికీ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతూ డాక్టర్ కటకం భాస్కర్ గుప్తా శ్రీ ఉజ్జయిని మహంకాళి టెంపుల్ ట్రస్ట్ బోర్డ్ మెంబర్

# ఘనం.. పీవీ వనం

**జయమునిచ్చే జమ్మి**



జమ్మిచెట్టుని 'శమీ వృక్షం' అని కూడా పిలుస్తారు. వైష్ణవ సంప్రదాయాలలో దీనిని 'ఆరణి' అని అంటారు. మహాభారతంలోని విరాట పర్వంలో పాండవులు జమ్మి చెట్టుపై తమ ఆయుధాలను భద్రపరుస్తారు. అజ్ఞాతవాసం పూర్తయిన తర్వాత విజయ దశమినాడు ఆ అస్త్రశస్త్రాలకు పూజలు చేసిన తర్వాత ధరిస్తారు. అందుకే దసరా పండుగ నాడు ఆయుధ పూజ, శమీ పూజ సంప్రదాయాలను హిందువులు పాటిస్తున్నారు. జమ్మిచెట్టు జయాన్ని ఇస్తుందని నమ్ముతారు. హిందువుల ఇళ్లలో ఉదయం ఆయుధ పూజ, సాయంత్రం జమ్మి పూజ చేస్తారు. జమ్మి చెట్టుకు ప్రదక్షిణ, పూజలు చేసిన తర్వాత ఆ చెట్టు ఆకుల్ని పెద్దలకు ఇచ్చి ఆశీర్వచనం పొందుతారు. ఈ ఆకుల్ని 'బంగారం' అంటూ పది మందికి పంచిపెడతారు. జమ్మి చెట్టుని 'నవ గ్రహాల వృక్షం'గా పరిగణించేప్పుడు మాత్రం శనీశ్వరునికి ప్రతీకగా భావిస్తారు. వినాయకుని పూజలో ఈ జమ్మి ఆకు కూడా ఉంటుంది.

**'శమీ శమయతే పాపం..**
**శమీ శత్రు వినాశనీ**
**అర్జునస్య ధనుర్ధారీ..**
**రామస్య ప్రియదర్శినీ'**
**అన్న శ్లోకాన్ని చెట్టు చుట్టూ తిరుగుతూ చదివి నమస్కారం చేసుకుంటారు.**

జమ్మి పూలు మొగ్గ దశలో పసుపు రంగులో ఉంటాయి. విరబూసే సమయానికి గులాబీ రంగులోకి మారతాయి. ఈ పువ్వు సన్నగా, పొడవుగా, త్రిభుజాకారంలో ఉంటుంది. జమ్మి అత్యల్ప వర్షపాతం ఉన్న ప్రాంతాల్లో కూడా పెరుగుతుంది. ఈ చెట్టు వేళ్లు భూమి లోపలికి చొచ్చుకొని, నీటిని గ్రహిస్తాయి. ఈ చెట్టు మధ్యస్థంగా పెరుగుతుంది. జమ్మి ఆకులు చింత ఆకుల్లా కనిపిస్తాయి. కానీ, పరిమాణంలో అంతకన్నా చిన్నగా ఉంటాయి. జమ్మి చెట్టు ఇంట్లో నాటుకుంటే ఇల్లు ప్రశాంతంగా ఉంటుందని నమ్మకం. కొమ్మను అంటుకట్టి, విత్తనాలనునాటి ఈ చెట్లు పెంచుకోవచ్చు. జమ్మిచెట్టు జయాలను ఇచ్చేదే కాకుండా సర్వరోగ నివారణి కూడా. ఆయుర్వేద ఔషధాల తయారీలో జమ్మి ఆకు, పూలు, విత్తనాలు, బెరడు ఉపయోగపడతాయి. విరేచనాలను కట్టడి చేయడానికి ఈ ఆకులను మజ్జిగతో కలిపి తీసుకుంటారు. జమ్మి కాయల్లో అనేక పోషకాలుంటాయి. జమ్మి కాయలతో కూరలు కూడా వండుకుంటారు. ఎడారి ప్రాంత వాసులు జమ్మి కాయలు ఎండబెట్టి, వరుగులు చేసుకొని సంవత్సరమంతా వంటల్లో వాడుకుంటారు.

# రైతాంగం ఆగమాగం



ఏడాదిలో ఎంత మార్పు? సమైక్య పాలకులు దండుగన్న వ్యవసాయాన్ని కేసీఆర్ పదేండ్లలో పండుగలా మారిస్తే కాంగ్రెస్ సర్కారు కేవలం 12 నెలల్లోనే అంతా తారుమారు చేసింది. కేసీఆర్ దూరదృష్టితో ప్రవేశపెట్టిన రైతుబంధు పెట్టుబడి సాయాన్ని చిందరవందర చేసింది. అసాధ్యమైన అర్హతలను సాకుగా చూపి లబ్ధిదారులను సగానికిపైగా తగ్గించబోతున్న సంగతి తెలిసిందే. గడిచిన వానకాలం, యాసంగి సీజన్లకు సంబంధించి అన్నదాతలకు అందించాల్సిన రూ.26 వేల కోట్ల పంట పెట్టుబడి సాయాన్ని ఎగ్గొట్టింది. రైతుకూలీలకు సైతం అందిస్తామని చెప్పిన సాయం ఎప్పుడిస్తారో తెలియని పరిస్థితి. ఇది ఒక పార్శ్వం మాత్రమే. ప్రభుత్వం మీద ఆశలుడిగిపోయి రైతు సొంతంగా పెట్టుబడి సమకూర్చుకొని కిందామీదా పడి సాగుచేసి పంటదీస్తే దాన్ని కొనుగోలు చేసే నాథుడే కరువయ్యాడు. వానకాలం సీజన్‌లో 1.56 కోట్ల టన్నుల ధాన్యం దిగుబడి వస్తే అందులో సర్కారు ఇప్పటివరకు కొన్నది 47 లక్షల టన్నులు మాత్రమే. సన్నాలకు రూ.500 బోనస్ ఇస్తామనే హామీ బోగస్‌గా మారింది. 50 లక్షల టన్నుల సన్నాల సేకరణ ప్రభుత్వ లక్ష్యం కాగా కొనుగోలు చేసింది 18.78 లక్షల టన్నులు మాత్రమే. తద్వారా తగ్గిన కొనుగోళ్ల వల్ల రైతులకు రూ.1,561 కోట్ల కోత ఏర్పడింది. ఆ కాస్త కొనుగోలు చేసిన ధాన్యానికి చెల్లించాల్సిన మొత్తంలో బకాయిలు పెట్టడం విడ్డూరం. అటు పంట పెట్టుబడి సాయంలో కోత, ఇటు ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యం చూపుతూ, ఆలస్యం చేస్తూ రైతులను సర్కారు తీవ్ర వేదనకు గురిచేస్తున్నది. ఇక రైతు రుణమాఫీ అనేది పెద్ద ప్రహసనంలా మారింది. రూ.2 లక్షల పైచిలుకు రుణాల మాట దేవుడెరుగు, అంతకు లోపు ఉన్న రుణాలను ఆగం పట్టించి, అంతంతమాత్రంగా అమలు చేసింది. తూతూమంత్రం రుణమాఫీతో సరిపెట్టి చేతులు దులిపేసుకుంది. గంపెడాశతో ఎదురుచూసిన రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. భూ యాజమాన్య హక్కులకు రక్షణ కల్పించి, బదిలీని సులభతరం చేసిన ధరణి వ్యవస్థను ధ్వంసం చేసింది. మరింత మెరుగైన వ్యవస్థ తెస్తానని చెప్పి మసిపూసి మారేడుకాయ చేసింది. అంతరించిపోయిన భూ తగాదాలకు తన అనాలోచిత నిర్ణయంతో మరోసారి తెరతీసింది. ప్రాజెక్టులను పడావుపెట్టి సాగునీటి సరఫరాను అస్తవ్యస్తం చేసింది. ఇది రైతులను ఆందోళనకు గురిచేసే అంశమే. మరోవైపు కార్పొరేట్లకు కొమ్ముగాస్తూ పరిశ్రమల పేరుతో భూములు లాక్కొని ఆగమాగం చేస్తున్నది. ఇలా రైతుకు సంబంధించిన అన్ని అంశాల్లోనూ సర్కారు వైఫల్యం, వారి పట్ల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. దీని ఫలితంగా రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. చరిత్రలో కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేస్తామని బీరాలు పలికే సర్కారు.. పుస్తకాల్లో పేజీలు చింపేసి తృప్తి పడుతున్నది. రైతు సమస్యల పరిష్కారంపై ఆ మాత్రం శ్రద్ధ పెడితే రాష్ట్రానికి ఎంతో మేలు జరుగుతుంది.

## గొరిగే వెంకటేష్ కురుమ కుటుంబ సభ్యులను పరామర్శించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**నిజం న్యూస్ ప్రతినిధి, ఉప్పల్, ఆగస్టు 4 :** ఉప్పల్‌కు చెందిన బీజేపీ జనరల్ సెక్రటరీ, ఉప్పల్ జోన్ కురుమ యువత అధ్యక్షులు గొరిగే వెంకటేష్ కురుమ అకాల మరణం పట్ల ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారి ఉప్పల్ కురుమ బస్తీ నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి , వెంకటేష్ కురుమ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కష్టకాలంలో ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులను ఓదార్చారు. వెంకటేష్ కురుమ సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉన్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆయన అకాల మరణం సమాజానికి తీరని లోటని విచారం వ్యక్తం చేస్తూ, భగవంతుడు వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూర్చాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని భరించే మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అమ్మకు అండ బిడ్డకు భరోసా

## ప్రసూతి సెలవులు మీ హక్కు



అమ్మ కావడం ఆడవాళ్లకు ఓ వరం. ఆ వరం అందుకునేవేళ ఆనందంగా, ఆరోగ్యంగా, సౌకర్యంగా బతకాలని అందరూ కోరుకుంటారు. చట్టం కూడా దాన్నే ఆదేశిస్తుంది. పనిచేసే మహిళలకు మాతృత్వపు ఆనందం, ఆరోగ్యం దూరం కాకుండా ఉండేందుకు ప్రసూతి ప్రయోజన చట్టం చేసింది. తల్లి కాబోయే మహిళకు ప్రభుత్వ విభాగాలు, కంపెనీలు సెలవులు, వేతనం, ఇతర సదుపాయాలు కల్పించేలా రక్షణలు ఏర్పాటుచేసింది. ఉద్యోగం పోతుందనే భయం లేకుండా, పుట్టే బిడ్డతో సంతోషంగా గడపమని చెబుతున్నది. ప్రసూతి సదుపాయాల చట్టాన్ని ఎలా ఉపయోగించుకోవాలో ప్రముఖ న్యాయ సహాయకురాలు జి. జ్యోతి రావు తెలియజేసిన వివరాలు 'జిందగీ' పాఠకుల కోసం..

**ప్రసూతి సెలవులు ఎప్పుడు తీసుకోవచ్చు?**

గర్భిణిగా ఉన్నప్పుడు, ప్రసవ సమయంలో, ప్రసవం తర్వాత సెలవులు తీసుకోవచ్చు. గర్భ విచ్ఛిత్తి అయినా, కాబోయే తల్లి ఆరోగ్యం, పుట్టబోయే బిడ్డకు ఇబ్బందులున్నా డాక్టర్ల సలహా మేరకు గర్భం తీయాల్సి వస్తే.. ప్రసూతి ప్రయోజన చట్టం ప్రకారం సెలవులు పొందవచ్చు.

**ప్రసూతి సెలవులు ప్రైవేటు కంపెనీల్లోని ఉద్యోగులకు వర్తిస్తాయా?**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పదిమంది కంటే ఎక్కువ మంది ఉద్యోగులు/ కార్మికులు పనిచేసే ప్రైవేటు సంస్థలు, కర్మాగారాలు, గనులు, దుకాణాలకు ప్రసూతి ప్రయోజన చట్టం వర్తిస్తుంది. ఈ సంస్థల్లోని ఉద్యోగులు, కార్మికులు ప్రసూతి సెలవులు పొందడానికి అర్హులు.

**పెళ్లికాని వాళ్లు ప్రసూతి సెలవులు తీసుకోవచ్చా?**

ప్రసూతి ప్రయోజన చట్టం ద్వారా సెలవులు, వేతనం, సదుపాయాలు పొందడానికి వివాహం, వైధవ్యంతో సంబంధం లేదు. గర్భధారణ అయినట్లుగా వైద్యులు ధ్రువీకరిస్తే చాలు.

**ఈ సెలవులు గరిష్ఠంగా ఎన్ని రోజులు తీసుకోవచ్చు?**

అందరి ఆరోగ్య స్థితి ఒకేలా ఉండదు. అలాగే అందరి ఇళ్లలో ఒకే విధమైన పరిస్థితులు ఉండవు. తల్లి, అత్త సహకారం ఉన్న మహిళలు బిడ్డల ఆలనాపాలనా ఇంట్లో పెద్దవాళ్లకు అప్పగించి ఆఫీస్‌కి వెళ్తుంటారు. కానీ, అందరికీ ఇలాంటి పరిస్థితులు ఉండవు. మరికొంతమంది ప్రసూతి సమయంలో ఆపరేషన్ జరగడం, అనారోగ్యం బారినపడటం వల్ల త్వరగా కోలుకోరు. కాబట్టి ప్రసూతి సెలువులు ముగిసినా విధులకు హాజరయ్యే పరిస్థితి ఉండదు. ఇలాంటి ఆరోగ్య, సామాజిక సమస్యలను దృష్టిలో పెట్టుకుని ప్రసూతి సెలవులు పొడిగించుకునేలా చట్టం వెసులుబాటు కల్పించింది.

**ప్రసూతి సెలవుల్లో వేతనం ఎంత ఇస్తారు?**

ప్రసూతి సెలవులన్నీ వేతన సెలవులే. ప్రతి సంస్థ తమ ఉద్యోగినులకు మెడికల్ ఖర్చులు, బోనస్, పిల్లలకు పాలు ఇవ్వడానికి సదుపాయాలు కల్పించాలని ప్రసూతి ప్రయోజన చట్టం నిర్దేశిస్తున్నది. ప్రసూతి ప్రయోజనాల చట్టం స్త్రీలు ఉద్యోగాలు చేయడాన్ని ప్రోత్సహించడమే కాకుండా మాతా శిశు సంక్షేమానికి వసతులు కల్పిస్తుంది. జీతభత్యాలు, ఇంటి అద్దె, వైద్య ఖర్చులకు కోత పెట్టే హక్కు ప్రభుత్వానికి గానీ, ప్రైవేట్ సంస్థలకు గానీ లేదు. కానీ, కార్యాలయానికి హాజరయ్యేందుకు ఇచ్చే ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్ లాంటి భత్యాల్లో కోత విధించవచ్చు.

**తల్లీ, బిడ్డ ఆరోగ్యంగా ఉంటే ముందే ఆఫీసుకు పోవచ్చా?**

ప్రసూతి సెలవులకు గరిష్ఠ పరిమితి ఉంది. కనిష్ఠ పరిమితి అంటూ ఏమీ లేదు. ఆరోగ్యంగా ఉండి, పని చేయగలిగితే కాన్పు అయ్యే రోజు వరకు విధులకు హాజరు కావొచ్చు. ఆ తర్వాత ప్రసూతి సెలవులు తీసుకోవచ్చు. గరిష్ఠంగా సెలవులు వాడుకోదల్చుకోని వాళ్లు, ఆరోగ్యం బాగున్నవాళ్లు ప్రసూతి తర్వాత 18 వారాలు పూర్తికాక ముందే విధులకు హాజరుకావొచ్చు. ప్రసవానికి ముందు ఎనిమిది వారాలే సెలవు తీసుకోవాలనే నిబంధన ఏమీ లేదు. వైద్యులు విశ్రాంతి అవసరమని సూచిస్తే ఎనిమిది వారాల కన్నా ముందు నుంచే సెలవులు తీసుకోవచ్చు.

**సెలవులు పొడిగించుకోవచ్చా?**

ప్రసూతి సెలవులు గరిష్ఠంగా 26 వారాలూ ఉపయోగించుకున్న తర్వాత అవసరాన్ని బట్టి మళ్లీ పొడిగించుకోవచ్చు. కొంతమంది ప్రసవ సమయంలో అరుదైన అనారోగ్య సమస్యలకు గురవుతారు. వాటికి చికిత్స, విశ్రాంతి ఎక్కువ అవసరం. బిడ్డకు కానీ, తల్లికి కానీ అలాంటి ఆరోగ్య సమస్యలు ఉంటే ఈ చట్టం ఎలాంటి ప్రత్యేక సదుపాయాలు కల్పించదు. కానీ, ఆర్జిత సెలవులతో లేదా వేతనం లేని సెలవులతో ప్రసూతి సెలవులను మరో 26 వారాలు పొడిగించుకోవచ్చు. గరిష్ఠంగా 52 వారాల వరకు ఈ చట్టం ద్వారా సెలవులు పొందవచ్చు.

**సెలవులు, వేతనం ఇవ్వకపోతే ఏం చేయాలి?**

ప్రసూతి సెలవులు, వేతనం వర్తించకుండా ఏదైనా సంస్థ ఉద్యోగులతో నియామక సందర్భంలో ఒప్పందం చేసుకుంటే చట్టరీత్యా నేరం. ఇలాంటి నిబంధనలతో నియామక పత్రాలు ఇస్తే వాటిని తిరస్కరించాలి. సంతకం చేయకూడదు. ఆ ఒప్పంద ప్రతిపాదన పట్ల అసమ్మతి తెలియజేస్తూ యాజమాన్యానికి ఉత్తరం రాయాలి. కార్మిక శాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలి. లేబర్ కమిషనర్‌ని లేదా కోర్టుని ఆశ్రయించాలి. కొన్ని ప్రైవేటు సంస్థలు, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు ఈ నిబంధనలు సంపూర్ణంగా పాటించడం లేదు. ఇలాంటి సంస్థలు ప్రసూతి సెలవులు నిరాకరించినప్పుడు ప్రభుత్వ సంస్థ అయితే పై అధికారులకు ఫిర్యాదు చేయాలి. ప్రైవేటు సంస్థలు అయితే కార్మిక శాఖకు కంప్లయింట్ చేయొచ్చు. అక్కడ న్యాయం జరగకపోతే కోర్టుని ఆశ్రయించవచ్చు.

**ప్రసూతి సెలవుల చట్టం 1961**

పనిచేసే మహిళలకు మానవీయ వసతులు కల్పించాలని, న్యాయపరమైన నిబంధనలు ఉండాలని, ప్రసవ సమయంలో పని నుంచి వెసులుబాటు కల్పించాలని, ప్రభుత్వం ఇతర ప్రయోజనాలు కల్పించాలని భారత రాజ్యాంగం, ఆర్టికల్ 42 స్పష్టం చేస్తున్నది. అంతర్జాతీయ కార్మిక సంస్థ 1952లో తన 103వ సమావేశంలో ప్రసూతి రక్షణ కల్పించాలని నిర్ణయించింది. దానికి లోబడి భారత ప్రభుత్వం 1961లో ప్రసూతి ప్రయోజన చట్టం తెచ్చింది. 2016లో ఈ చట్టంలో కొన్ని సవరణలు చేసింది.

# బకెట్ హ్యాట్సాఫ్









సమ్మర్ వచ్చిందంటే ఇంట్లో టోపీ ఎక్కడ పెట్టామో వెతుకుతాం. దొరక్కపోతే కొత్తది ఆర్డర్ పెట్టేస్తాం. వేసవి అవ్వగానే మళ్లీ టోపీ ఊసే ఉండదు. మరి, వింటర్ సంగతేంటి? చలి తగలకుండా వెచ్చగా ఉండాలంటే? టోపీలు ఏం లేవా? అంటే.. ఎందుకు లేవు? మంకీ క్యాప్‌లు ఉన్నాయిగా అంటారేమో!! అవి కావండోయ్%%% ఇప్పుడు మనం మాట్లాడుకునే టోపీలు ఇప్పటివి కాదు.. జమానా నుంచి వాడుకలో ఉన్నవి. ఏ కాలంలోనైనా హాయిగా వాడదగ్గవి. అవే 'బకెట్ హ్యాట్'లు. ఎవర్ గ్రీన్ ట్రెండ్‌గా నేటి తరాన్ని ఆకట్టుకుంటున్న ఈ బకెట్ హ్యాట్‌లకు సంబంధించిన ఫ్యాషన్ విశేషాలే ఇవి. బకెట్ హ్యాట్ అనే పేరు దాని ఆకారం నుంచి వచ్చిందే! ఇది ఒక బకెట్‌లా గుండ్రంగా ఉంటుంది. తలను అన్ని వైపుల నుంచి కప్పి ఉంచుతుంది. ముత్తాతల నాడు పాశ్చాత్య దేశాల్లో మత్స్యకారులు, రైతులు ఈ టోపీని ధరించేవారు. కాలక్రమంలో ఈ టోపీలు ఫ్యాషన్ రంగంలోకి ప్రవేశించాయి. తర్వాత రకరకాల మెటీరియల్స్‌తో తయారై, కొంగొత్త రంగులు పులుముకున్నాయి. నయా డిజైన్లు సంతరించుకొని ఫ్యాషన్ ప్రియులకు దగ్గరయ్యాయి. 19వ శతాబ్దం చివర్లో ఐర్లాండ్‌లోని మత్స్యకారులు ఎండ, వర్షం నుంచి కాపాడుకోవడానికి ఒక ప్రత్యేకమైన రకం టోపీని ధరించేవారు. ఆ టోపీలే ప్రపంచవ్యాప్తంగా ఒక ఫ్యాషన్ ఐకాన్‌గా మారాయి. 1950 ప్రాంతంలో యూరప్ యువత ఆధునిక జీవన సంస్కృతి వైపు అడుగులు వేసింది. ఆ సమయంలో అక్కడ 'మోడ్' ఉద్యమం పురుడుపోసుకుంది. యువతను ఆకర్షించడానికి రాక్ బ్యాండ్స్ నిర్వహించేవారు. ఈ హిప్-హాప్ సంస్కృతిలో బకెట్ హ్యాట్‌కూ ప్రత్యేక స్థానం ఉంది. ర్యాపర్లు, స్ట్రీట్‌వేర్ ప్రేమికులు బకెట్ హ్యాట్‌కు తమ ట్కస్టైల్‌కు అనుగుణంగా ధరించేవారు. అలా బకెట్ హ్యాట్‌కు ఎనలేని ప్రాధాన్యం వచ్చింది. ఫ్యాషన్ స్టేట్‌మెంట్‌గా మారింది.

**ఫ్యాషన్ మాత్రమే కాదు..**

బకెట్ హ్యాట్ ఫ్యాషన్ మాత్రమే కాదు! ఇది వేసవిలో ఎండ నుంచి కాపాడుతుంది. అలాగే, చలికాలంలో తలను మొత్తం కప్పేసి వెచ్చగా ఉంచుతుంది. అంతేకాదు.. వాటర్ ప్రూఫ్ మెటీరియల్స్‌తో తయారైన బకెట్ హ్యాట్‌లు వానాకాలం ఇబ్బడిముబ్బడిగా అమ్ముడవుతాయి. ఇది బడ్జెట్‌లో దొరుకుతుంది. ఎలాంటి మెటీరియల్‌తో అయినా దీనిని రూపొందించొచ్చు. ట్రెండీగా కనిపించడానికి అదనపు అలంకరణలూ చేయొచ్చు. క్యాజువల్ కాలేజీ డ్రెస్‌లకూ, ఫ్యాషన్ వస్త్రశ్రేణిపైకి కూడా ఇది నప్పుతుంది. ఫార్మల్, ఇన్‌ఫార్మల్.. లుక్ ఏదైనా ఈ బకెట్ హ్యాట్ ట్కస్టైల్‌గా సెట్ అయిపోతుంది. ఓవర్ సైజ్డ్ డ్రెస్‌లకు ఇది చక్కని ఆప్షన్. నేటి తరం యువతీ యువకులు మరో అడుగు ముందుకేసి పర్యావరణహితంగా 'ప్లాంట్స్ ఫ్రెండ్లీ ఫ్యాబ్రిక్స్'తో తయారుచేసిన బకెట్ హ్యాట్స్‌ని వాడుతున్నారు. ఆర్గానిక్ కాటన్‌తో తయారుచేసిన వాటికి, రీసైకిల్ పాలిస్టర్ మెటీరియల్స్‌కి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. అంతేకాదు.. తమ అభిరుచికి తగ్గట్టుగా బకెట్‌హ్యాట్‌కి అదనపు సొగసులు అద్ది 'హ్యాట్సాఫ్' అనిపించుకుంటున్నారు!



# అల్లాపూర్ డివిజన్‌లో అధ్వానంగా మారిన రోడ్లు.. అధికారులను నిలదీసిన బండి రమేష్



**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, ఆగస్టు 4:** ఈ-బ్లాక్ రోడ్డు పనులు వెంటనే ప్రారంభించాలి -- సంబంధిత అధికారులకు ఆదేశం కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ మంగళవారం అల్లాపూర్ డివిజన్‌లోని సఫ్దర్ నగర్ ప్రాంతంలో పర్యటించి స్థానిక ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా నాలుగు నెలల క్రితం ఇదే ప్రాంతంలో పాదయాత్ర చేసినప్పుడు గుర్తించిన సమస్యలే ఇప్పటికీ కొనసాగుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఈ-బ్లాక్ రోడ్డు నిర్మాణంలో జిహెచ్ఎంసి, వాటర్ వర్క్స్ శాఖల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల పనులు నిలిచిపోయాయని పేర్కొన్నారు. వెంటనే కూకట్‌పల్లి జోన్ జిహెచ్ఎంసి అధికారులతో ఫోన్‌లో మాట్లాడిన బండి రమేష్, రోడ్డు పనులను ఆలస్యం చేయకుండా తక్షణమే ప్రారంభించాలని కోరారు. రోడ్డు పనులకు ఇప్పటికే నిధులు మంజూరైనా పనులు ప్రారంభం కాకపోవడంతో వర్షాకాలంలో ఈ-బ్లాక్ కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. మంజీరా పైప్‌లైన్ పనులను సాకుగా చూపుతూ రోడ్డు పనులు నిలిపివేయడం సరికాదని, అవసరమైతే వాటర్ వర్క్స్ అధికారులతో సమన్వయం చేసుకుని సమస్యను పరిష్కరించి వెంటనే పనులు ప్రారంభించాలని సంబంధిత అధికారులకు సూచించారు. బండి రమేష్ పర్యటన సందర్భంగా స్థానిక కాలనీవాసులు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల అవసరాలను బట్టి అన్ని సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో అల్లాపూర్ వాజీద్ పాషా, అబ్దుల్లా, లక్ష్మణ్ గౌడ్, సాయి తులసి, రేష్మ, లక్ష్మి, రాము, రాంబాబు, శంకర్, నరసింహా, నరసింహ యాదవ్, వేణు, సతీష్‌తో పాటు స్థానిక కట్టమైసమ్మ దేవాలయ కమిటీ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.